## సింగిల్ పేజీ కథలు


# తాయారు

అనగా అనగా ఓ తాయారు! ఆ తాయారుకి ఏడు గేదెలు. మా కాలనీలో యథేచ్ఛగా విహరిస్తూ వీధులు మురికి చేస్తూ ఉంటాయి. పొరబాటున ఏదైనా ఇంటి గేటు తెరచి ఉంటే ఆవరణలో చొరబడి ఉన్న కాస్త జాగాలో అపురూపంగా పెంచుకుంటున్న పూల మొక్కల్ని మేసి చక్కా పోతుంటాయి. తాయారును గానీ తాయారు గేదెల్ని గానీ మందలించే ధైర్యం మా కాలనీలో ఎవరికీ లేదు. తాయారు అంటే అందరికీ భయం కాదు భక్తి. తాయారు మా కాలనీలో పాల వ్యాపారం చేస్తూ పరిపాలిస్తోంది మరి.

* * *

మా కాలనీ మొగలో పెద్ద ఖాళీ జాగా. అక్కడక్కడా పెద్దమామిడిచెట్లు. ఆ చెట్ల మధ్యనున్న తాటాకుల పాక తాయారు నివాసం. అదే జాగా పశువుల నిమిత్తం మరో పాక. పెద్ద గడ్డివాము. మున్సిపల్ వాటర్ టాపు. ఓ హేండు పైపు పశువులకు దాణా పెట్టడానికి పెద్ద పెద్ద గోలాలు ఉంటాయి. తాయారుకి సహాయకులుగా ఆమె భర్త, మరో ఇద్దరు పనివాళ్లు. ఇది ఆమె పరివారం.

తాయారు నల్లగా ఎత్తుగా దృఢంగా ఉంటుంది. వయసు నలభైకి కాస్త అటూ ఇటుగా ఉంటాయి. ఆమె నవ్వు ఓ చిత్రమైన ఆకర్షణ. చీరకుచ్చిళ్లు ఎగదోపుకుని ఒక క్షణం తీరిక లేకుండా తిరుగుతూనే ఉంటుంది. కొందరికి తాను ముందుగా తీసిన పాలను, నీర-క్షీర సూత్రాన్ని మిళితం చేసి అమ్ముతుంది. మరికొందరికి స్పెషల్ రేటు మీద వారి ముంగిట్లో దాణాబకెట్టుతో సహా గేదెను తోలుకువెళ్లి "అమ్మగారూ! చూసు కోండి" అంటూ వారి ఎదురుగానే పొదుగు కడిగే నెపం మీద హస్తలాఘ వంతో నీరు మిక్స్ చేసి పాలు అమ్ము తుంది. వ్యాపారం అన్నాక జిమ్మిక్స్ తప్పవు గదా! మరి తాయారుకి కాలనీ వాసులతో ఉన్న అనుబంధం గురించి...



మా కాలనీ అంతా ఉద్యోగస్తులు. ఉదయం వెళ్లినవాళ్లు సాయంకాలానికో రాత్రికో ఇంటికి చేరుతారు. వాళ్లకు ఇంటి పనులు చేయడానికి సావకాశం తక్కువ. సొంతపనులంటే బద్ధకం ఎక్కువ. ఆ బద్ధకం మా కాలనీవాళ్లకు మరీ ఎక్కువ కావడానికి కారణం తాయారేనని చెప్పాలి.

తాయారు పాలగేదెలతో మా కాలనీ పర్యటనకు వచ్చినప్పుడు ఆమెకు విన్నపాలు ప్రారంభమవుతాయి.

"తాయారూ! గ్యాసు బండ అయిపోవచ్చింది. గ్యాసువాడు వస్తే మా ఇంటికి పంపు. చుట్టాలు వచ్చారు మర్చిపోకు!" అంటూ ఓ ఇల్లాలి అభ్యర్థన.

"అలానే అమ్మా! మీది హెచ్.పి.గ్యాసే కదా! నేను పంపిస్తాను. ఒకవేళ ఈలోగా అయిపోతే చెప్పండి రామలక్ష్మిగారింట్లో స్పేరు ఉంటుంది. నేను తీసుకుని ఇస్తాను" అంటూ సమస్యకి తక్షణం పరిష్కారం చెబుతుంది.

"తాయారూ! మా చెడ్డ చిక్కొచ్చిందే! మొన్నటివరకూ పల్లెలో ఉండి వచ్చాం. అక్కడ అటెండర్లు చేపలు, రొయ్యలు మంచి చౌకగా తెచ్చేవారు. ఇక్కడ బేరాలు నా వల్ల కావడం లేదు. బజారుకి వెళ్లి తెచ్చుకోరు. భోజనం దగ్గర చిరాకులు. అర్ధాకలి భోజనాలయిపోయాయి మా ఇంట్లో" అంటూ బ్యాంకు మేనేజరుగారి భార్య అన్నపూర్ణ గారు వాపోతే-

"నేను కొని పంపిస్తాను దిగులు పడకండి!" అంటుంది తాయారు.

"తాయారూ! అమెరికా నుంచి మా మనవడు ఫోను చేసినప్పుడల్లా తాను వచ్చేసరికి రేగి వడియాలు, బూడిద గుమ్మడికాయ వడియాలు సిద్ధం చేసి ఉంచ మంటున్నాడు. ఇంట్లో వాళ్లకి ఎన్నిమార్లు చెప్పినా నా మాట వినబడడం లేదు" అంటూ బామ్మగారు వినిపి స్తారు.

"రేపు ఆదివారం నాటికి అన్నీ సిద్ధం చేసుకొండి. ఊరు నుంచి వట్టి గడ్డి బ్రోకర్లు వస్తారు. వాళ్లకు పురమాయించి ఏర్పాటు చేయిస్తాను. పనిలో పనిగా కూర పనసకాయ కూడా తెప్పిస్తాను" అంటూ బామ్మగారిని గాలిలో తేల్చివేస్తుంది.

అంతెందుకు తాయారుకి పురమాయిస్తే పచ్చళ్లకు అవసరమైన చింతకాయలు, ఉసిరి కాయలు, మామిడి, నిమ్మ, దబ్బకాయలు, ఎండుమిరపకాయలు, వెల్లుల్లిపాయలు లాంటివన్నీ చౌకగా దొరుకుతాయి.

ఇంకా ఎవరికైనా ప్లంబరు, ఎలక్ట్రీషియన్, తాపీ, వడ్రంగి, మేస్త్రీలు కావలసిన టైలరు, ఇస్త్రీ బండివాడు, పనిమనుషులు, సున్నం వేసే వాళ్లు, పెయింటర్లు ఎవరు కావల్సినా ఆమె ఏర్పాటు చేయగలదు.

తాయారు పంపించిన మనుషులు చాలా తక్కువ రేట్లకు పనిచేయడం విశేషం. బహుశా ఆ కారణం వల్లనే అంతా తాయారు సహాయం కోరడానికి కారణం కావచ్చు.

"తాయారూ! తెల్లవారుజామున మూడు గంటలకు ట్రైనుకి వెళ్లాలి. అర్ధరాత్రి ఆటో కోసం ఎక్కడ తిరగాలో అర్థం కావడం లేదు. పిల్లలతో ప్రయాణం" అన్నా

"రెండు కాకుండా మీ ఇంటి ముందు ఆటో ఉంటుంది. మీరు ప్రయాణానికి సిద్ధంగా ఉండండి" అంది తాయారు.

అక్కడే ఎవరో చెప్పారు. ఈశ్వరరావుగారి అమ్మాయికి పురుడు సమయం. కాలనీ ఊరికి దూరం. రాత్రిపూట ఆసుపత్రికి వెళ్లాలంటే ఎలా అని దిగులుపడుతుంటే వారం రోజుల పాటు ఓ టాక్సీ ఉచితంగానే ఈశ్వరరావుగారి గుమ్మంలో ఉండేలా ఏర్పాటు చేసిందట తాయారు.

మా కాలనీ నుంచి కాలేజీకి వెళ్లే అమ్మాయిలు సెంటర్‌లో బస్సు కోసం నిలబడతారు. అక్కడ కొందరు ఆకతాయిలు చేరి అల్లరి చేయడం రివాజుగా జరుగుతుంది. వాళ్లను ఏమీ అనలేక మా కాలనీవాళ్లు తలవం చుకుని చక్కా పోతారు. ఓ రోజు తాయారు కంట బడిందా దృశ్యం. తాయారు ఆదిశక్తిలా వాళ్ల మీద విరు చుకుపడి "మీకు అక్కా - చెల్లెళ్లు లేర్రా! మీకు ఇక్కడ పనేంటి? పేగులు తోడేస్తా! రక్తం తాగేస్తా!" అంటూ వీరంగం చేసింది. మళ్లీ ఆ కుర్రాళ్లు మా కాలనీవైపు వస్తే ఒట్టు. అప్పట్నుంచి కాలేజి అమ్మాయిలు ఎవరైనా పోకిరీ వేషాలు వేస్తే తాయారుకి ఫిర్యాదు చేయడం ప్రారంభిం చారు.

తాయారు ఉదయం నుండి రాత్రివరకూ మా కాలనీ వాసుల అవసరాలు తెలుసుకుని మరీ తీరు స్తుంది. ఏ పనిలోను కమిషన్లు లేవు. మరే విధమైన

ప్రలోభం లేకుండా ఆత్మీయంగా సహాయపడే తాయారంటే మా కాలనీలో అందరికీ అభిమానమే. పరోపకారం మిదం శరీరం అన్నట్లుగా ఉంటుంది మా తాయారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు వచ్చాయి. మా కాలనీ వార్డు లేడీ రిజర్వేషనులో పడింది. ఇక అంతా తాయారుని కౌన్సిలర్ చేద్దామని తీర్మానించుకున్నాం. కొందరు సందేహరాయుళ్లు "తాయారు కౌన్సిలర్ అయితే మనకు వెనుకట్లా సహకరిస్తుందా?" అన్న సందేహం వ్యక్తం చేశారు. తాయారుకి ఎటువంటి కల్మషం లేదని మరికొందరు సమాధానపరిచారు. కాలనీ జనం అంతా కలిసి తాయారు దగ్గరకు వెళ్లి కౌన్సిలర్‌గా నిలబడాలని కోరారు.

తాయారు నవ్వింది. "వద్దు బాబూ! నన్ను ఇలా బ్రతకనివ్వండి. మీరంతా గొప్పగొప్ప చదువులు చదువుకున్న మారాజులు. మీ అందరి అభిమానం నామీదుంటే చాలు. ఏ పదవులూ వద్దుగాక వద్దం"టూ కరాకండీగా చెప్పేసింది.

తాయారు మాకు మరింత ప్రీతిపాత్రురాలయ్యింది.

**-వి.వి.సుబ్బరాజు (కాకినాడ)**

# మార్పు

జగన్నాథంగారు మరణించే సమయానికి ఇద్దరు కొడుకులూ దగ్గరే ఉన్నారు. మంచంమీద నుండి కిందకు దింపుతున్నప్పుడు దిండు కింద ఒక కవరు కనిపించింది.

చిన్నకొడుకు అవి తీసుకుని లోపలకి వెళ్లి చూసి వచ్చి "అన్నయ్యా ఇలా ఒక్కసారి రా" అని పిలిచాడు. పెద్దకొడుకు వెళ్లి "ఏమని?" అడిగాడు. కవర్ని అన్నయ్యకు ఇచ్చాడు తమ్ముడు. ఆ కవరు విప్పి చూస్తే అందులో పదివేల రూపాయలు, ఒక చిన్న చీటి ఉంది.

"నా అంత్యక్రియల కోసం!" అని ఆ చీటీలో రాసి ఉంది.

ఇద్దరూ ఒకళ్ల మొహాలొకరు చూసుకున్నారు.

* * *

జగన్నాథరావుగారు జగమెరిగినవారు.

తనకున్న విద్వత్తుకు తగిన ఉద్యోగాలు వెదుక్కుంటూ వచ్చినా నలుగుర్ని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. ఆ ఆదర్శంతోనే ఎంతోమందికి విద్యాదానం చేశారు. అతని వద్ద చదివిన ఎంతోమంది ఎన్నో రంగాల్లో ఉన్నతమైన పదవులలో ఉన్నారు. కృతజ్ఞతా పూర్వకంగా నేటికి ఆయనను తలుచుకుంటూంటారు.

విద్యాదానంతో పాటు ఎంతోమంది పేద విద్యార్థులకు గుప్తదానాలు చేసి చదివించారు. అడిగిన వాళ్లకు లేదనకుండా యథాశక్తి ఉపకారం చేసి మంచిని, గౌరవాన్ని సంపాదించుకున్నారు. మంచి క్రమశిక్షణ గల మనిషని పేరు తెచ్చుకున్నారు.

తన ఇద్దరి కొడుకులనీ వాళ్లు చదివినంతవరకూ చదివించేరు. పెద్ద కొడుకు పి.జి. చేసినా ఉద్యోగం దొరక్కపోయేసరికి తన అభీష్టానికి విరుద్ధమైనా కొడుకు కోసం తమ సంస్థలోనే అధికారులను అర్థించి తాను స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఉద్యోగం ఇప్పించారు.

ఇహ రెండో కొడుకు పరీక్షల్లో పాసయినా తగిన ర్యాంక్ రాకపోవడంతో గవర్నమెంటు కాలేజీలలో సీటు రాలేదు. కొడుకు ఆసక్తి గమనించి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో తలకు మించిన డొనేషన్ కట్టి మరీ ఇంజినీరును చేశారు.

ఈ విధంగా ఇంటాబయటా కూడా తనకుమాలిన ధర్మం నిర్వర్తించారు. తనకు ఉంటే తినేవారు అంతేగాని తన కోసం ఇతరులు కష్టపడేందుకు ఇష్టపడేవారు కాదు. 'దేహీ' అని ఎవరిని అడిగేవారు కాదు. తన విషయంలో ఏ పని అయినా ముందే ఆలోచించి కార్యాచరణ చేసేశారు.

అలాగే తన తదనంతరం కొడుకులకు భారం కాకుండా తన వద్ద ఎప్పుడూ సరిపడా ధనం ఉంచుకునే వారు. అలా జాగ్రత్త చేసినదే ఈ పదివేలు కూడా.

అన్నదమ్ముల్దిదరూ ఆ డబ్బును జాగ్రత్త పెట్టి తండ్రి వద్దకు వచ్చి తరువాత జరగవలసిన కార్యక్రమం గురించి ఆలోచించారు. ఒక గంటలో ఇంటి వద్ద జరగవలసినవన్నీ జరిగిపోయాయి.

శ్మశానానికి తీసుకు వెళ్లారు. అక్కడ ఆచార ప్రకారం దహనం చేసే ఏర్పాటూ, ఇప్పటి సౌలభ్యం ప్రకారం విద్యుత్ దహన ఏర్పాటూ రెండూ ఉన్నాయి.

అక్కడకు రాగానే అన్నదమ్ములిద్దరూ సంశయంలో పడ్డారు. అయిదారు వేలు ఖర్చు పెట్టి బ్రాహ్మణుల చేత మంత్రసహితంగా, మన సంప్రదాయం ప్రకారం దహనం చేయించడమా...లేక విద్యుత్ దహనం కావించడమా అని ఆలోచించారు.

విద్యుత్ దహనం అయితే 105 రూపాయలు మాత్రమే అని అక్కడి అధికారి చెప్పేడు.

బయటకు ఏమీ కనబడదు. శవం కాలుతున్నప్పటి బీభత్సం చూడనక్కర లేదు. ఒక గంటలో లోలోపలే అంతా అయిపోతుంది. చనిపోయాక శరీరాన్ని లేకుండా చేయడమే కదా కావల్సింది. ఆ పని ఎలా చేస్తేనేం? పూర్వం ఇలాటి పద్ధతులు లేవుకాబట్టి పాత పద్ధతులే తప్పేవి కాదు.

ఇన్నాళ్లూ మనతోపాటు కలసి ఉన్న వ్యక్తి శరీరం మన ఎదురుగానే కాలిపోతూ ఉంటే కళ్లారా చూస్తూ భరించే కన్నా ఇలా అయితేనే మంచిది కదా! ప్రాణం లేని కట్టెకి ఎలా దహనం చేశారో తెలుస్తుందా? అదీకాక వేలకొద్దీ అయ్యేది. ఒక వందతో అయిపోతూ ఉంటే ఆ అనవసర ఖర్చు దండగే కదా!

ఇలా తర్జనభర్జన పడి ఆఖరికి తండ్రిని విద్యుత్ దహన వాటికలోనే దహనపర్చి వచ్చారు అన్నదమ్ములిద్దరూ.

మిగతా కార్యక్రమాలన్నీ లాంఛనప్రాయంగా, అయిదారు వందలతో అయిందనిపించి మిగిలిన సొమ్మును చెరిసగం పంచేసుకున్నారు ఇద్దరన్నదమ్ములూ!

* * *

జగన్నాథరావుగారు జీవితంలో ఎప్పుడూ ఇలా ఆలోచించి దేనికీ రాజీపడలేదు. ఎవరినీ కష్టపెట్టలేదు. చేయవలసిన పనిని తన కర్తవ్యంగా భావించి దేనిలోనూ లోభత్వం పడకుండా నిర్వర్తించేవారు. ఉన్నంతలో సంతృప్తిగా, సుఖంగా బ్రతికారు. కొడుకుల విషయంలో ఏ లోటూ చేయలేదు.

తల్లిదండ్రులకు తను చనిపోయే వరకూ తద్దినాలు పెడుతూ వారిని స్మరించుకుంటూ మాతాపితల ఋణం తీర్చుకుంటూనే ఉన్నాడు. తనకూ తన కొడుకులు అలాగే చేస్తారని ఆశించేరు కాబోలు.

అయినా జరిగింది ఏమిటి?

తనువు చాలించాక ఈ శరీరం పంచభూతాలలో కలిసిపోవాలి.

చితిమంటలలోనయితే పంచభూతాలూ తమలో కలుపుకుంటాయి. ఎలక్ట్రికల్ క్రిమేషన్‌లోనయితే ఇది జరుగుతుందా?

జగన్నాథంగారి శరీరాన్ని ఒక కృత్రిమాగ్ని కబళించింది!

అతని శరీరంగాని, భస్మంగాని నేలను తాకలేదు!

సహజమైన అగ్ని తనలో కలుపుకోలేదు!

వాయుదేవుడు అగ్నికీలల్ని రగల్చలేదు!

నీటితో చితి చల్లార్చబడలేదు!

ఆకాశం కింద దహనసంస్కారం జరగలేదు!

భూమి, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు ఈ పంచభూతాలతో సంపర్కమే లేదు అతని శరీరానికి.

అయినా జగన్నాథరావుగారి ఆత్మకు శాంతి కలగాలనే ఆశిద్దాం!

**-ద్వివేదుల సోమనాథశాస్త్రి**